క్లుప్తంగా

26న ప్రజ్ఞ వికాస పరీక్షలు

పార్వతీపురం: ఈ నెల 26న ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ తెలిపారు. పరీక్షలకు సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. రూ.25 ప్రవేశ రుసుం చెల్లించి హాల్‌టికెట్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ ప్రచార సభ పరీక్షలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కురుపాం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న హిందీ ప్రచార సభ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం 108 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా..104 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వాహకులు ఎస్.సత్యనారాయణ, సతోష్‌కుమార్ పండా, హెచ్ఎం తోట శంకరరావు తెలిపారు.

గీతా సారాంశాన్ని తెలుసుకొని మెలగాలి


గీతా సారాంశాన్ని వివరిస్తున్న ఎస్‌వీ రమణ

పాలకొండ: ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకుని మెలగాలని సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి ఎస్‌వీ రమణ అన్నారు. కోటదుర్గమ్మ ఆలయ ఆవరణంలో ఆదివారం గీతా సత్సంగం ప్రథమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతలో రాసిన ప్రతీ అక్షరం మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. గీతా సారాంశాన్ని వివరించారు. ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండడం ద్వారా మనసును ప్రశాంతంగా ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎం.రాజమోహన్, దామోదరరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగుకు సన్నద్ధం


జియ్యమ్మవలస: మండలంలోని గిరిశిఖర గ్రామాలైన పల్లపుసిరిపి, నడిమిసిరిపి, పిటిమండ, చాపరాయిగూడ, దీశరగూడ, బల్లేరు, కొంబచిలకాం తదితర గ్రామాల్లో గిరిజనులు ఎక్కువగా పోడువ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వేసవికాలం రాగానే కొండ ప్రాంతాల్లో రాళ్లు, పిచ్చిమొక్కలు తొలగించి చదును చేస్తారు. వర్షాలు కురిసాక కందులు, జొన్నలు, కొర్రలు, తదితర పంటలు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతారు. కొండచిలకాం వద్ద ఆదివారం పలువురు గిరిజన రైతులు కొండపోడును శుభ్రం చేస్తుండగా తీసిన చిత్రమిది.

విస్తారంగా దొండ సాగు


కొత్తూరులో సాగుచేస్తున్న దొండపంట

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస, గరుగుబిల్లి, పెద్దూరు, కొత్తూరు తదితర గ్రామాల్లో రైతులు సుమారు 12 ఎకరాలలో దొండపంటను సాగు చేస్తున్నారు. పంట సాగుకు తక్కువ ఖర్చు, తెగుళ్ల బెడద కూడా తక్కువగా ఉండడంతో నీటి వనరులు ఉన్నచోట ఈ పంటను సాగు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. పంట 40 రోజుల నుంచి 120 రోజుల వరకు చేతికి వస్తుంది. కుటుంబానికి కావాల్సిన కూరలు సమకూరడంతో పాటు అదనపు పంటను విక్రయించడం ద్వారా ఆదాయం వస్తోందని రైతులు అంటున్నారు.

ఘనంగా రామ మందిరం ప్రతిష్ట


సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని రెండు రోజులుగా నిర్వహిస్తున్న రామ మందిర ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మందిరం ప్రాంగణంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

శ్రీరాముని దర్శించిన ఎమ్మెల్యే జోగారావు


స్వామివారిని పూజిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని పెదంకలాంలో పునర్నిర్మాణం చేసి నిర్వహించిన శ్రీరాముని ఆలయ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం స్వామిని దర్శించుకున్నారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న రామాలయం ప్రతిష్టా ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామానికి ఆయన వచ్చిన సందర్భంగా ఎంపీపీ బి.రమణమ్మ, సర్పంచ్ బి.శ్రీనివాసరావు ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు మేళతాళాలతో సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు లక్షరూపాయలు విరాళంగా ఇచ్చారు. సీతారామ లక్ష్మణ సమేతంగా కొలువుతీరిన స్వామివారికి ఎమ్మెల్యే చేత ఆలయ అర్చకులు వేదుల నానిశర్మ, వేదబ్రహ్మ అరవిల్లి విజయ్‌కుమార్‌శర్మ పూజలు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ వి నాగేశ్వరరావు,మండల వ్యవసాయసలహా కమిటీ అధ్యక్షుడు పి.ఈశ్వర నారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పార్టీ సీనియర్ నాయకులు టి.వెంకటప్పల నాయుడు, పార్థసారథి, పలుగ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి వైద్యసిబ్బంది కృషిచేయాలి

- డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు


చిన్నారుల బరువును పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం టౌన్: చిన్నారుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి, శిశు మరణాలు నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఆస్పత్రిలోని న్యూట్రిషన్ రిహ్యాబిలిటేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి అడ్మిట్ అయిన చిన్నారుల ఆరోగ్యస్థితిని పిల్లల బరువును పరిశీలించారు. రోజువారీ పర్యవేక్షణ చికిత్స సంబంధిత రికార్డులను, పౌష్టికాహార మెనూ తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లల్లో బరువు తక్కువగా, పోషకాహార లోప లక్షణాలు గుర్తించి నట్లయితే వైద్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది వారి పరిధిలో ఉండే జిల్లా ఆస్పత్రి, ఎన్ఆర్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రి, సీతంపేటలో ఎన్ఆర్‌సీ కేంద్రానికి గానీ రిఫర్ చేస్తున్నారని, అదేవిధంగా నవజాత శిశువులలో శ్వాసకోశ సంబంధమైన లక్షణాలు గుర్తించిన వెంటనే ప్రాథమిక చికిత్స అందించి తీవ్రతను బట్టి జిల్లాలో ఉన్న ఎస్ఐసీయూ, ఎస్ఎన్‌సీయూ కేంద్రాలకు వైద్యసిబ్బంది రిఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


నానిబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ రూరల్: మండలంలోని మంగళాపురం ఎంపీటీసీ సభ్యుడు కరణం నానిబాబు, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరామర్శించారు. నానిబాబు తల్లి పార్వతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కళావతి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్వతమ్మ మృతికి సంతాపం తెలిపారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ వాకముడి అనిల్‌కుమార్, తదితరులున్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే


ఉత్సాహంగా డాన్స్ చేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషిచేయాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తమ్మినాయుడు విద్యా సంస్థల ప్రిన్సిపాల్ తిరుపతిరావు అన్నారు. కళాశాలలో ఆదివారం ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ అలవర్చుకోవాలని, కృషి, పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

ఆశాజనకంగా మామిడి తోట


వెంకటాపురంలో ఏపుగా పెరిగి పూతదశలోఉన్న మామిడి మొక్కలు

సీతానగరం: ఉపాధిహామీ పథకం నిధులు, అటవీశాఖ పర్యవేక్షణలో గల నర్సరీలనుంచి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన మామిడి మొక్కలు అభివృద్ధి చెంది పూతదశకు వచ్చాయని ఏపీఓ నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు కలిగి, తక్కువ భూములు, నీటివనరులున్న రైతులకు ఇదివరలో పంపిణీచేసిన మామిడి, జీడి, సపోటా,బాదం,జామ,నేరేడు ఇతర ఫలజాతి, ఔషధ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎకరా విస్తీర్ణానికి 60 మొక్కలు వంతున 2020-21, 2021-22లో 31 మంది రైతులకు 2,900 మొక్కలు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆరుగురు రైతులకు 470 మొక్కలు పంపిణీ చేసి ఎంపీడీఓ పర్యవేక్షణలో నాటినట్లు చెప్పారు. అప్పట్లో రైతులు నాటిన మొక్కలకు సంరక్షణ చేయడంతో ఏపుగా పెరిగి ఈ ఏడాది ఫలసాయం అందుతోందని తెలిపారు. అలాగే నిరంతరం ప్రజలు తిరుగాడే రోడ్డుకు ఇరువైపులా 2021-22లో 30 గ్రామ పంచాయతీల్లో 11,154 మొక్కలు, 2022-23లో 6 పంచాయతీల్లో 2,300 మొక్కలు నాటినట్లు చెప్పారు. మొక్కలు కావలసిన చిన్న, సన్నకారు రైతులకు అంటిపేట గ్రామంలో వనసంరక్షక్ చంటి నర్సరీలో అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం


పార్వతీపరమశ్వరుల కల్యాణం జరుపుతున్న వేదపండింతులు

బాదంగి: మండలంలోని పిన్నవలస గ్రామ శివాలయంలో శివలింగం ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం బ్రహ్మశ్రీ అంపోలు ఉమామహేశ్వరశర్మ వేదమంత్రోచ్చరణల నడుమ పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు స్వామి వారి కల్యాణం తిలకించేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్లు, కో-కన్వీనర్లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జియ్యమ్మవలస మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా దొనక కిరణ్‌కుమార్, కో-కన్వీనర్లుగా పల్ల అనంతనాయుడు, ఉదయాన సత్యంనాయుడు, జోగి సురేష్, అలుగోలు లోకేష్, రౌతు ఉపేంద్రనాయుడు నియమితులైనట్లు పార్టీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు తెలిపారు. నియామకాలు పొందిన వారికి పార్టీ మండల కన్వీనర్‌తో పాటు జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

సీతంపేట: వైఎస్సార్‌సీపీ సీతంపేట మండలం సోషల్ మీడియా కన్వీనర్‌గా కె.సింహాచలం, కో-కన్వీనర్లుగా ఎస్.వెంకటేష్, ఎం.మురళి, బి.సాయికిరణ్, ఎస్.సాయికుమార్ నియమితులయ్యారు.

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా గోరిశెట్టి జనార్దన(గిరిబాబు), కో-కన్వీనర్లుగా ఎద్దు మురళి, బిడ్డిక సూర్యారావు, పెద్దింటి జోగారావు, తుంబలి వినోద్‌లను పార్టీ అధిష్టానం నియమించింది.

గ్రామదేవత ఉత్సవాలకు విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న గ్రామ పెద్దలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో గ్రామదేవత ఉత్సవాల నిర్వహణకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 23 నుంచి మే 3వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించారు. 63 ఏళ్ల తర్వాత చేపడుతున్న ఈ పండగను ఘనంగా చేసేందుకు భారీ ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. పండగ నిర్వహణకు సుమారు రూ.20 లక్షలు అవసరం ఉంటుందని, ఆ మేరకు గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించనున్నట్లు చెప్పారు. గ్రామ పెద్దలు రాయి రామకృష్ణ, కరణం నారాయణరావు, శాసుబిల్లి జనార్దనరావు, మాకెన సతీష్, పతివాడ మోహనరావు, బలగ నాయుడుబాబు, జోష్యుల కామేశ్వరరావు ఆధ్వర్యంలో విరాళాలు సేకరిస్తున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాస పరీక్ష


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 26న పదో తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాస పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిక గంగరావు, కిల్లక అనీల్ తెలిపారు. ఈమేరకు ఆదివారం గుమ్మలక్ష్మీపురంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి ప్రజ్ఞావికాస పరీక్షపై పదో తరగతి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పరీక్షలపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు ఈ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులంతా సద్వినియోగించుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందన్నారు.

కోడూరు పుణ్యక్షేత్రంలో సప్తవారాల ఆరాధన

బాదంగి: మండలంలోని కోడూరు క్రైస్తవ పుణ్యక్షేత్రంలో సప్తవారాల ఆరాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఫాదర్ పి.యుగళ్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతీ వారంలో వచ్చే శనివారం అఖండజపమాల, సిలువమార్గం, దివ్యసత్ప్రసాద ఆరాధన, వాక్య పరిచర్య, దివ్యబలి పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే మార్చి 11వ తేదీన పాపపశ్చాత్తాప పాదయాత్ర ఉంటుందన్నారు.

సీఎం జగన్ పాలనలో

అణగారిన కులాలకు రాజ్యాధికారం

- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు, తదితరులు

వీరఘట్టం: అనగారిన కులాలకు రాజ్యాధికారం ఇస్తే ఆ కులాలు అభివృద్ధి చెందుతాయని చెప్పిన భారత రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. ఆదివారం వీరఘట్టంలో ఏర్పాటు చేసిన కళింగ వైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 56 కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజ్యాధికారం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 4.50 లక్షల జనాభా ఉన్న కళింగ వైశ్యుల అభివృద్ధికి గతంలో ఏ ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి పాలనలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. వీరఘట్టంలో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. సామాజికంగా వెనుకబడిన వారిని గుర్తించి ఆదుకోవాలని సంఘ సభ్యులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని కోరారు. కళింగ వైశ్య సంఘం కల్యాణ మండపం కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అందవరపు కోటీశ్వరరావు, జిల్లా కార్యదర్శి సంకా గౌరీశంకరరావు, స్టేట్ డైరెక్టర్ లాడి మెహర్‌ప్రసాద్, సభ్యులు కెంగువ అంజనేయులు, భోగి మణి, తూముల రమేష్, కోణార్క్ శ్రీను, వారణాసి కృష్ణమూర్తి, చిన్నారి తవిటిరాజు, దేవరశెట్టి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కళింగ వైశ్యులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

కొమరాడ: రాష్ట్రంలో సుమారు 4.5 లక్షల మంది ఉన్న కళింగ వైశ్యులకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కళింగ వైశ్య పెద్దలు కోరారు. మండలంలోని తులసివలస గ్రామంలో మండల కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కోశాధికారి దేవరశెట్టి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, కురుపాం మాజీ జెడ్పీటీసీ, మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కోటీశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుతో కళింగ వైశ్యుల అభివృద్ధికి చేయూత అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్నను మనమంతా కలిసి మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొమరాడ కళింగ వైశ్య కులపెద్దలు బుడుమూరి శ్రీనివాసరావు, వడ్డీ గాంధీలను సన్మానించారు.

ప్రజలకు వాస్తవాలను తెలియజేయండి

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర


ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను కలిసిన పాచిపెంట మండల సోషల్‌మీడియా కన్వీనర్, కన్వీనర్లు

సాలూరు: ప్రభుత్వంపై ప్రతిపక్షపార్టీలు చేస్తున్న అవాస్తవాలను తిప్పికొడుతూ,ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర సూచించారు. వైఎస్సార్‌సిపి సోషల్‌మీడియా పాచిపెంట మండల కన్వీనర్, కో కన్వీనర్‌లుగా నియమితమైన నేపథ్యంలో వారిద్దరూ రాజన్నదొరను పట్టణంలోని ఆయన గృహంలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమం, అభివృద్ధి పనులను పార్టీ సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సోషల్ మీడియా నియమనిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: పట్టభద్రుల స్థానానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రచార పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికకు పట్టభద్రులంతా తమ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ వి.శంకర్రావు, బి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల నుంచి ధాన్యం తరలింపు


కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యం నిల్వలను గుర్తించిన మేరకు ఉన్నతాధికారుల సూచనలతో ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నామని ఏఓ ఎస్.అవినాష్ తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లోని పలు కళ్లాల్లో గల ధాన్యం నిల్వలను గెడ్డలుప్పి, బూర్జ, పెదభోగిలి గ్రామాల రైతులు రామకృష్ణ, అప్పారావు, సత్యనారాయణ ఏఓ ఎస్.అవినాష్‌కు ఆదివారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు ధాన్యం నిల్వలను పరిశీలించినట్లు చెప్పారు. రైతుల కళ్లాల్లో 4,850 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. కొంత మంది రైతులు ఈ క్రాప్ చేయించుకునేందుకు అందుబాటులో లేకపోవడం, సాంకేతికపరమైన ఇబ్బందులు, వాతావరణం అనుకూలించి వరిపంట అధిక దిగుబడులు రావడంతో కొనుగోలు సామర్థ్యం పెంచాల్సి ఉందన్నారు. మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

అ‘పూర్వ’ కలయిక


పాఠశాల పూర్వ విద్యార్థులు

కురుపాం: వారంతా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975లో పదో తరగతి పూర్తిచేశారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అయినా చిన్ననాటి స్నేహితులను, చదువుకున్న పాఠశాలను మరిచిపోలేదు. సుమారు 47 ఏళ్ల తర్వాత ఆదివారం వారంతా స్థానిక పాఠశాల ప్రాంగణంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, కుశలప్రశ్నలు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ సందడిగా గడిపారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారిని సన్మానించారు. పాఠశాలకు అభివృద్ధికి తమవంతు సాయం అందచేశారు. కార్యక్రమంలో పాటిమీద కుమార్, కొత్తకోట విశ్వనాథం, గౌటారి వెంకటరావు, గోవింద కృష్ణారావు, కె.కోటేశ్వరరావు, వెంకట సన్యాసిరాజులు తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట


రామభద్రపురం పోలీస్ చెక్‌పోస్టు వద్ద పోలీసులకు సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆదివారం పరిశీలించిన ఆయన రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలి కావడంతో ఇక్కడి సరిహద్దు ప్రాంతంలోని ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందన్నారు. ఆ అక్రమ రవాణా జరగకుండా ఉక్కుపాదం మోపేందుకే ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులను హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ సురేంద్రనాయుడు, సిబ్బంది సత్యనారాయణ ఉన్నారు.